RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 300.00 |
| 2. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 3. | నవయుగ సాహిత్యము (ప్రజ్ఞావతార కథామృతము) | 180.00 |
| 4. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 5. | యూనివర్సల్ మైండ్ | 130.00 |
| 6. | అమృతత్వ విద్య | 120.00 |
| 7. | ఆణిముత్యాలు (భగవద్గీత ముఖ్యాంశాలు) | 130.00 |
| 8. | ఆత్మకథ | 60.00 |
| 9. | విశిష్ట యోగసాధనలు | 60.00 |
| 10. | అకల్ట్ అనాటమీ, వేదిక్ వాస్తు, అస్ట్రాలజీ, హోమియోపతి | 60.00 |
| 11. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 12. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 13. | ఆధ్యాత్మిక విద్య లక్ష్యము | 30.00 |
| 14. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 15. | శ్రీసూక్తము | 20.00 |
| 16. | 10 ఆసనాలు - సూర్య నమస్కారాలు | 10.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ పి. సీతారాముడు | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |
| ✧ శ్రీమతి ఎమ్.వి. సుబ్బులు | హైదరాబాద్ | 94909 94835 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే విశ్వము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ, మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక

✧❋✧❋✧

❋ యోగవిద్యకు మీకు కావలసింది ఒకటే, దూకే సాహసం కావాలి. దూకేయగలగాలి.

✧ ఇది చాలా గొప్పది అని తెలుసు. కానీ దూకలేకపోతున్నామనే ఆ బాధ ఉందే, ఆ బాధని "అర్జున విషాద యోగము" అన్నారు.

❋ యోగము అనేది అదేదో చాలా గొప్పది ఉంది. దాన్ని నేను పొందాలి అనే ఆ ఆవేదన, ఆ తపన, మీలో బయలుదేరనంత వరకు, యోగవిద్య యొక్క మొదటి అడుగు ఇంకా మనం వెయ్యలేదని అర్థం.

❋ మనమందరం అనేక జన్మల బట్టి ఆ మెట్టు మీదే ఉన్నాం. ఆ మెట్టు నుంచి దూకలేకపోతున్నాం.

✧❋✧❋✧

రూ. 20.00 ఏప్రిల్ 2013 88

## విషయ సూచిక


✧ భౌతిక శరీరము మీకు లభించడానికి కారణం
గురువు యొక్క అనుగ్రహమే 4

✧ మీరు ఏమీ చేయకండి
మీ లోపల ఉన్న గురువుని చేయనివ్వండి 8

✧ ఆ కురుక్షేత్ర యుద్ధం మన శరీరాలలో
మూడు రకాలుగా జరుగుతుంది 11

✧ ఆయన వరించాలి. మనం కాదు 15

✧ మీ అసలైన గురువు మీ మనస్సే 21

✧ ధర్మక్షేత్రంలోని ఆ గ్రుడ్డితనాలు నుండి బయటపడండి 23


(1998 అక్టోబరు 11, 12 తారీఖుల్లో భగవద్గీత, అర్జున విషాదయోగం మీద డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు ఇచ్చిన ఉపన్యాసాలు నుండి)


సంపుటి - 8 సంచిక - 4

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 240.00

ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం.
00461 00110 20050
IFSC Code : ANDB 0000046

చందా పంపించవలసిన చిరునామా :
పి. సీతారాముడు,
8-2-6/9-1, ప్రశాంతి వీధి,
నర్సయ్య అగ్రహారం,
భీమవరం - 534 201, ప.గో. జిల్లా.
ఫోన్ నెం. : 90106 47325
78421 33860

Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers, Bhimavarm and Published at 8-2-6/9-1, N. Agraharam, Bhimavaram, W.G. Dt., A.P.
Editor : P. Sita Ramudu







ఈ దిగువ పరిజనుల భాగస్వామ్యముతో ఈ సంచిక వెలువడినది

| | |
|---|---|
| శ్రీ ఏ. శివకుమార్ | హనుమకొండ |
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీ రామానంద స్వామి | అమలాపురం |
| మౌంట్ శంబళా | హైదరాబాద్ |
| శ్రీ టి.వి.ఎస్. నాగేశ్వరరావు | యలమంచిలి |
| శ్రీమతి ఎమ్. సరళాకుమారి | విశాఖపట్నం |
| శ్రీమతి ఎస్. రాజేశ్వరి | విశాఖపట్నం |
| చి॥ కె. ఓజస్విని | విశాఖపట్నం |
| చి॥ జి. రామనాథ్ | విశాఖపట్నం |
| చి॥ జి. రఘునాథ్ | విశాఖపట్నం |

పై పరిజనులు అందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

5.4.13 నాటికి స్వర్ణయుగము మాసపత్రిక సభ్యుల సంఖ్య : 144

# భౌతికశరీరము మీకు లభించడానికి కారణం గురువు యొక్క అనుగ్రహమే

భగవద్గీత గురించి అనేక మంది చెప్పినప్పటికి భగవద్గీతను ఎవరూ యోగవిద్యా పరంగా చెప్పలేదని నాకు అన్పిస్తుంది.

భగవద్గీతలో యోగము కంటే గొప్పదైనది లేదు, తపస్సు కంటే, జ్ఞానము కంటే కూడా యోగమే గొప్పది, నువ్వు యోగవంతుడివి కా అని శ్రీకృష్ణుడు చెప్పినప్పటికీ కూడా ఎందుకో ఆ దృష్టికోణం రాలేదు.

✧ ఇక్కడ ఆ దృష్టికోణంతో భగవద్గీతను చదువుకుంటాం.

❀ భగవద్గీతను యోగవిద్యాపరంగా చదువుకుంటున్నప్పుడు భగవద్గీతలోని 18 అధ్యాయాలూ యోగవిద్యలే.

అర్జున విషాద యోగోనామ ప్రథమోధ్యాయః. అది కూడా యోగమే. సాంఖ్యయోగము, కర్మయోగము. జ్ఞానయోగము, విజ్ఞానయోగము, చివరికి మోక్ష సన్యాసయోగము. అన్నీ యోగాలే.

భగవద్గీతలో ఉన్నటువంటి 18 అధ్యాయాలు కూడా యోగాలే.

ఇక్కడ యోగము అనే పదాన్ని, ముఖ్యంగా ప్రపంచానికే ఒక మార్గదర్శకులం కాదల్చుకున్న మన సమూహము, యోగవిద్య యొక్క అంతరార్థాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

చాలా మంది నన్ను అడుగుతూవుంటారు, "మాస్టారు! మరి మాకు గురువు ఉన్నాడా?"



వాళ్ళు ఆ ప్రశ్న వేయటానికి కారణం నేనే.

***ఎందుకంటే, నేను ఏం చెప్తూవుంటానంటే,***

❀ భౌతిక శరీరధారి ఎవర్నీ కూడా మీరు గురువుగా స్వీకరించకండి అని.

-- ఈ కలికాలంలో ఆ మాట అనటానికి కావలసిన కారణాలు ఉన్నాయి.

"మరి భౌతికశరీరధారి అయినటువంటి వ్యక్తిని నేను గురువుగా స్వీకరించకపోతే, సూక్ష్మశరీరంతో వచ్చేటటువంటి గురువును నేను గుర్తించలేను కనుక, మరి నా పరిస్థితి ఏమిటి?" అదీ పాపం వాళ్ళ ప్రశ్న.

మనకి ఆ అనుమానం ఎందుకొస్తుంది అంటే, గురువుని మనం వెతుక్కుని, "నాయనా నువ్వు నాకు గురువు కా!" అని ఆ మహానుభావుడి చేత ఒప్పించుకుని, ఫలానా ఆయన నా గురువు అని చెప్పుకున్న తరవాతే గురువు మీ జీవితంలోకి వస్తాడు అనే ఒక మూర్ఖమైనటువంటి అవగాహన వచ్చేసింది.

❀ మానవ శరీరము మీకు లభించటమే గురువు యొక్క వరదానము.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి. జంతూనాం నరజన్మ దుర్లభం. జంతుశ్రేణిలో ఉన్నాం మనమందరం.

❀ సడన్‌గా ఒక విచిత్రమైన ట్రాన్స్‌ఫర్మేషన్ వల్ల జంతు స్థాయిలోంచి మనం మానవస్థాయిలోకి వచ్చాం.

ఈ మార్పు మన చేతిలో లేదు. ఈ విధంగా మారటం జంతువు చేతిలో ఉందనుకుంటున్నారా మీరు? అది గురువు అనుగ్రహమే.

✺ మీకు ఆల్‌రెడీ గురువు ఉన్నాడు. లేకపోతే మీకు భౌతిక శరీరం రాదు. ఆయన మిమ్మల్ని ఇంత వరకు తీసుకొచ్చాడు. ఆ గురువే.

❀✲❀

# గురువు అనుగ్రహం మీ మీద ఉంటే మీకు కష్టాలే ఉంటాయి

లక్షల సంవత్సరాలు బట్టి మీరు గురువు యొక్క అనుగ్రహంలో జీవిస్తున్నారు. ఆ గురువు యొక్క అనుగ్రహం వల్లే ఈనాడు మీరు ఈ స్థితిలో ఉన్నారు.

గురుచరిత్రలో కూడా నేను మిమ్మల్ని అర్థం చేసుకోమనేది అదే. గురుచరిత్ర పారాయణ చేశాను, నాకేం సుఖాలు వచ్చాయి అని ప్రశ్నిస్తారు.

❋ యోగికి ఈ ప్రశ్న రాదు.

సాధకుడికి, యోగికి ఉన్న తేడా చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోండి.

ఈ మానసికమైన శీర్షాసనం మీరు వెయ్యగలగాలి.

కచ్చితంగా శీర్షాసనమే అది.

ఇంత వరకు మనం ఏమనుకుంటున్నాం? "సాయి అనుగ్రహం వల్ల మాకు ఈ కష్టాలు పోయాయి" అని.

మీరు చాలా భ్రమలో ఉన్నారు.

❋ సాయి అనుగ్రహం వల్ల కష్టాలు పోవు, కష్టాలు వస్తాయి.

"అయితే ఈసారి నుంచి సాయి అనను!"

మీరు అన్నా, అనకపోయినా మీ గురువు మీ హృదయంలోనే ఉన్నాడు. ఆ గురువు యొక్క క్లచెస్ నుంచి మీరు పారిపోలేరు. మీరేం చేయగలరు అంటే, కళ్ళు మూసుకోగలరు. అంతకంటే మీరేం చేయలేరు. మీరు అది చేస్తున్నారు. కళ్ళు తెరవండి! అదీ నేను చెప్పేది.



❋ గుర్తుంచుకోండి,

నిజంగా గురువు అనుగ్రహం మీ మీద ఉంటే మీకు కష్టాలే ఉంటాయి.

కానీ మీకు కష్టాలు ఇవ్వాలా, ఇవ్వకూడదా అన్నది కూడా ఆ గురువే నిర్ణయిస్తాడు. అది మీ చేతిలో ఏం లేదు.

**మీరు చేయగలిగేది ఏమిటంటే,**

ఆ నియమాన్ని అర్థం చేసుకుని జీవించటం.

అందుకే అర్జునుడు చాలా తెలివైనవాడు. 18వ అధ్యాయంలో చివర్లో శ్రీకృష్ణుడు ఏం చెప్తాడు, నేను చెప్పవలసింది అంతా చెప్పాను. నువ్వు నాకు భక్తుడివి, ప్రియ మిత్రుడివి. అందుకని నేను ఇదంతా చెప్పాను.

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు. (భ.గీ. 18-63)

ఈ విధముగా రహస్యములన్నిటికంటెను పరమ రహస్యమైనట్టి జ్ఞానమును (గీతాశాస్త్రము) నేను నీకు జెప్పితిని. దీనినంతను బాగుగా విచారణచేసి తదుపరి నీ కెట్లిష్టమో అట్లాచరింపుము.

యథేచ్ఛసి తథా కురు - నీకు ఏది ఇష్టమయితే అది చేయి అన్నాడు.

అర్జునుడు ఆయన మీద త్రిప్పికొట్టగలిగాడు.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ. (భ.గీ. 18-73)

ఓ శ్రీకృష్ణా! నీ యనుగ్రహమువలన నా యజ్ఞానము నశించినది. జ్ఞానము (ఆత్మస్మృతి) కలిగినది. సంశయములు తొలగినవి. ఇక నీయాజ్ఞను నెరవేర్చెదను.

కరిష్యే వచనం తవ - నువ్వు ఏం చెప్తే అది చేస్తాను. నేనేం అడగను.

❋❋❋

# మీరు ఏమీ చేయకండి
# మీ లోపల ఉన్న గురువుని చేయనివ్వండి

* అడిగే స్థితిలో యోగి ఉండడు,
  చేసే స్థితిలో ఉంటాడు.

* "నువ్వు నన్ను ఏం చేయమంటావు?
  నన్ను ఏదో చేయటానికి ఈ భూమి మీదకు దింపావు."

***నేనేం చేస్తున్నాను,***

లెక్చరర్‌గానో, క్లర్క్‌గానో, ఆఫీసర్‌గానో, జడ్జిగానో, ప్రెసిడెంట్‌గానో, రోడ్లు ఊడ్చేవాడిగానో, ....... ఇలాగ ఎలా బ్రతికినా ఒకటే. దానికి ఏ విలువా లేదు.

ఎందుకంటే, ఈ భౌతిక జీవితంలో మీరు జీవించే జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి ఏ విధమైన స్పర్శా లేదు. ఇది కేవలము ఈ శరీరాన్ని నడిపించుకోవటానికి పనికొస్తుంది అనే శీర్షాసనం వేయగలగాలి మీరు.

* ఆ శీర్షాసనం వేసినప్పుడు మొట్టమొదట మీకు కష్టాలు సుఖాలుగా మారతాయి. సుఖాలు కష్టాలుగా మారతాయి.

అది మహాభారతంలో ఎక్కడ ప్రూవ్ అవుతుంది అంటే, దూర్వాసుడు దుర్యోధనుడి రాజభవనానికి వస్తాడు. దుర్యోధనుడు కడుపునిండా ఆహారం పెట్టి చేయగలిగిన మర్యాదలన్నీ చేశాక ఏమంటాడు,

"మా పాండవులు అడివిలో ఉన్నారు. మీ అనుగ్రహం వాళ్ళకి కూడా రావాలి. అందుచేత వాళ్ళకి కూడా దర్శనాన్ని కలగజేయండి" అన్నాడు.



అనుగ్రహం కోసం పంపించాడా? దూర్వాసుడికి కోపం ఎక్కువని తెలుసు. అంటే ఏమిటి? వీడు ఇక్కడ రాజభోగాలు అనుభవిస్తూవున్నా కూడా వాడి దృష్టి అడివిలో ఉంది.

***అడివిలో వాళ్ళెలా ఉన్నారు,***

అక్షయపాత్రతో ఉన్నారు.

* ఆ ఎబౌట్ టర్న్, అడివిలోవున్నా అక్షయపాత్ర ఉన్నట్టు జీవించగలగటం.

-- ముందు మీరు ఉన్నట్టు జీవించటం మొదలెడితే,
   అది మీ దగ్గరకి వస్తుంది.

ఈ ఎబౌట్ టర్న్ వేసుకున్న తరవాత అర్జున విషాద యోగం మనకి అర్థమవటం మొదలెడుతుంది.

***ఏమిటి అర్జునుడు యొక్క విషాదం?***

నాకు కోరికలు తీరలేదు అనే విషాదం లేదు. అసలు ద్రౌపదికి, పాండవులకి కోరికలు లేవు. వాళ్ళు మహారాజ పుత్రులు. కానీ

* అడివిలో ఉండమంటే అడివిలో ఉన్నారు.
* అడుక్కు తినమన్నారు ఏకచక్రపురంలో, అడుక్కు తిన్నారు.
* కాదూ, మీరు ఫలానా రాజుగారి ఇంటికి వెళ్ళిపోయి గోవుల్ని కాయండి, వంట చేయండి. చేశారు.

***ఎవరు వంట చేసింది?***

భీముడు. విరాటపర్వంలో చదివుంటారు.

***ద్రౌపది ఏం చేసింది?***

జడలు వేసింది. సెంట్లు నూరింది. సైరంధ్రి!

మహారాజ పుత్రులు, శ్రీకృష్ణుడికి స్వయంగా సంబంధికులు చేయవలసిన పనా అనిపిస్తుంది మనకి. కానీ వాళ్ళు చేసిందది.

***అందుచేత మొట్టమొదట మీరు నేర్చుకోవలసింది ఏమిటంటే,***

మీరేం చేయరు.

మరేం చేస్తారు మీరు? శరీరాన్ని నిలబెట్టుకోవటానికి కావలసిన పనులన్నీ సక్రమంగా చేస్తూవుంటారు. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకుంటారు.

ఇంక ఎక్కడుంటే అక్కడుంటారు.

మీకు కోరికలు ఏమైనా ఉంటేకదా మీకు బాధ. ఏం ఉండవు.

♣ అప్పుడు మీ లోపలికి ఆ గురువు యొక్క అంశ దిగటం మొదలెడుతుంది.

"మరి ఇవాళే దిగిపోతుందా మాస్టారు?"

చెప్పలేను. మీలో చాలా మంది మంచి యోగస్థితిలో ఉన్నవాళ్ళు ఉన్నారు. మీకు గుర్తురావటం లేదంతే. దానికి నేను చేయగలిగేదేముంది?

అందుచేత యోగస్థితి ఎప్పుడు మీకు క్లిక్ అవుతుంది?

చెప్పలేం, ఈ రోజు రాత్రి క్లిక్ కావచ్చు.

***క్లిక్ కావటం అంటే నా ఉద్దేశ్యం, నా భావం ఏమిటి?***

♣ మీరు ఏమీ చేయకుండా, ఆ పరమాత్మ మీ హృదయం లోపల ఉన్నటువంటి ఆ గురువు ఏమి నిర్దేశన చేస్తాడో అదే చేస్తారు.

అర్జునుడు మహా భారత యుద్ధానికి రెడీ అయ్యాడు. రెడీ అయ్యాక తనేం చేయడు. తన రథాన్ని, తన శరీరాన్ని నడిపేది ఎవరు? ఆ జగద్గురువే.

ఆ మానసిక స్థితిని మీరు అర్థం చేసుకోండి.



# ఆ కురుక్షేత్ర యుద్ధం మన శరీరాలలో మూడు రకాలుగా జరుగుతుంది

భగవద్గీత శ్లోకాలు యొక్క అంతరార్థాన్ని గమనించండి.

ధృతరాష్ట్ర ఉవాచ :-

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సంజయ. (భ.గీ. 1 -1)

ఓ సంజయా! నా వారలగు దుర్యోధనాదులు, పాండు పుత్రులగు ధర్మరాజాదులును యుద్ధముచేయు కుతూహలముతో పుణ్య భూమియగు కురుక్షేత్రమున జేరి యేమి చేసిరి?

ధృతరాష్ట్ర ఉవాచ - రాష్ట్రము అంటే దేహము.

ధృత అంటే కలిగివున్నవాడు. దేహాన్ని కలిగివున్నవాడు.

***ఎవరు దేహాన్ని కలిగివున్న వాళ్ళు?***

మనమందరము.

ఆ ధృతరాష్ట్రుడు మనందరికీ వచ్చే ప్రశ్న అక్కడ వేస్తున్నాడు.

***కానీ అతను ఎలాంటి వాడు?***

గుడ్డివాడు.

యోగము చాలా గొప్పది, ట.

శ్రీకృష్ణుడు చాలా గొప్పవాడు, జగద్గురువు, ట.

స్థితప్రజ్ఞత్వం చాలా గొప్పది, ట.

గుడ్డియేగా, మనకి ఏ అనుభూతులూ లేవు.
భగవంతుడు యొక్క అనుభూతి లేదు. అన్నీ 'ట'లే.

ఆ గుడ్డితనంలో ధృతరాష్ట్రుడికి వచ్చిన అనుమానమే మనకూ వస్తోంది. ఏమిటి ఆ అనుమానం?

ధర్మక్షేత్రే - ఇది ధర్మము అని మనకు తెలుసు.
ఆ విధమైన ధర్మాన్ని కురుక్షేత్రే, ఆచరణలో పెడితే కొంపలంటుకుపోతాయని కూడా మనకి తెలుసు.

రూల్స్ ప్రకారం, ధర్మం ప్రకారము ఆనెస్ట్‌గా ఏదైనా పనులు చేయబోతే ఏమౌతుందో ఈ కాలంలో మనకి తెలుసుకదా, కుదరదది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే - ఈ రెండిటి మధ్య ఎప్పుడూ యుద్ధం వస్తుంది.

అందుకే మీరు చూసుకోండి, మీరు యోగులు అవునా, కాదా? మీరు సాధకులు అవునా, కాదా అనే మీకు అనుమానం వస్తే, ఈ ప్రశ్న మీరు వేసుకోండి.

✧ ఏదైనా ఒక పనిని చేయొచ్చా, చేయకూడదా అని మీకు అనుమానం రాలేదనుకోండి, కచ్చితంగా మీరు సాధకులు కారు.

ఎంచేతంటే, మీకు అనుమానం రాలేదంటే, రెండే అయుండాలి, ఏది కరెక్టో మీకు కచ్చితంగా తెలిసి ఉండాలి. తెలిసిందంటే ఇంక మీరు చాలా గొప్ప వాళ్ళే. తెలియలేదు అంటే మీకు దాని గురించి అవసరం లేదయినా ఉండాలి.

✡ అందుచేత మీ జీవితంలో నిరంతరం, ఆఖరికి మంచి నీళ్ళు త్రాగుతోన్నప్పుడు కూడా సాధకుడికి ఈ అనుమానం వస్తుంది.

ఐదవ అధ్యాయం చదువుతోన్నప్పుడు మనం చూస్తాం, ఊపిరి పీల్చుకుంటోన్నప్పుడు సాధకుడికి అనుమానం వస్తుంది, "నేను ఊపిరి పీల్చుకోవచ్చా,



పీల్చుకో కూడదా?" అదృష్టం బావుండి వాడి చేతిలో అది లేదు. లేకపోతే వాడు ఈ అనుమానంలోనే ఉంటాడు, ఉష్, గందరగోళం అయిపోయేది.

సమవేతా యుయుత్సవః - యుద్ధం కోసం జేరారు.

ఏ విధమైనటువంటి యుద్ధం చేస్తున్నామో జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

✧ ఆ యుద్ధం మీ శరీరాల్లో 3 రకాలుగా జరుగుతుంది.

ఆ 3 రకాలైన యుద్ధాల్ని గాయత్రీ మంత్రంలో భూర్ భువః స్వః గా, హ్రీం శ్రీం క్లీం గా, ఇవాళ శ్రీకృష్ణాలో యక్ష, గంధర్వ, నాగ అని చెప్పారు. పేర్లు మారతాయంతే, శాస్త్రం ఏం మారదు. అందుచేత ఆ మూడు రకాలైనటువంటి యుద్ధాల్ని మీరు గుర్తుంచుకోండి.

❃ మనకి భౌతిక శరీరం ఉంది.
ఈ భౌతిక శరీరానికి తనకి కావలసిన కోరికలు తనకు ఉన్నాయి.

భౌతిక శరీరం సుఖంగా ఉండాలని అనుకుంటుంది. ఎండగా ఉంటే చల్లగా కావాలనుకుంటుంది. రకరకాలైన భౌతిక సుఖాల్ని అది కోరుకుంటుంది.

❊ కోరుకునేది ఏది? శరీరం.
ఉపయోగించుకునే వాడు ఎవడు? యోగి.
వాళ్ళిద్దరి మధ్యా నిరంతరం యుద్ధం జరుగుతూవుంటుంది.

❃ ఇంకొక రకమైనటువంటి యుద్ధం జరుగుతూ వుంటుంది, కోరికలు.

రకరకాలైన కోరికలు. వాటితో వేరే ఒక కామమయ శరీరం, సూక్ష్మశరీరం ఉంది అని యోగశాస్త్రం చెప్తుంది.

❊ యోగి, సూక్ష్మశరీరం మధ్య యుద్ధం.

❃ ఇంక ఆలోచనలు. ఇంక వాటి గురించి గొడవే లేదు కదా!

చాలా మంది నా దగ్గరకొచ్చి చెప్తారు, "మాస్టారు! నేను ధ్యానం చేయటం మొదలెట్టాను, ఎన్నెన్ని పిచ్చి పిచ్చి కూడని ఆలోచనలు వస్తున్నాయో!"

✧ వాళ్ళకి తెలియదసలు, అవి చాలా కరెక్ట్ అని.

ఇల్లు కట్టాలి అంటే ఫౌండేషన్ త్రవ్వుతాం. త్రవ్వితే మట్టి బయటకొస్తుంది. మట్టి బయటకొస్తోంది, ఇంకేం ఇల్లు కడతారు, గోడ కట్టమంటే వీడు గుంట త్రవ్వుతున్నాడు అంటామా మనం? గోడ కట్టాలి అంటే గుంట త్రవ్వాలి.

అందుచేత ఆలోచనలు వస్తాయి. అందులో తప్పేం లేదు.

❋ కానీ ఆ ఆలోచనలు మనకి ఇష్టం లేదు.
ఆ ఆలోచనలు కూడనివి అని మనకి తెలిసినా కూడా వస్తున్నాయి.
ఇది మూడవ రకమైనటువంటి యుద్ధం.

ఈ మూడు రకాల యుద్ధాల్ని గుడ్డిగా చేస్తున్నాం.

✧ శరీరం యొక్క కోరికలు తెలియవు.
యోగి ఎలా ఉపయోగించుకోవాలో తెలియదు.

✧ కామమయ శరీరం యొక్క కోరికలు తెలియవు.
యోగి యొక్క కోరికలు తెలియవు.

✧ మనోమయం యొక్క ఆలోచనలు తెలియవు.
యోగి యొక్క ఆలోచనలు తెలియవు.

గుడ్డివాడు! ఎవర్ని అడుగుతున్నాడు?

సంజయా - దివ్యదృష్టి కలిగిన మహాత్ముడ్ని.

మనకి వాళ్ళు చెప్పగలరు. మిగతా వాళ్ళు చెప్పలేరు.



# ఆయన వరించాలి. మనం కాదు

❋ యోగము అనేది సాధన చేసే విషయం కాదు.

అది ముందు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా. (భ.గీ. 11-53)

నన్ను ఏ రీతిగ నీవు చూచితివో, అటువంటి రూపముగల నేను వేదములచే (వేదాధ్యయనపరులచే) గాని, తపస్సుచేగాని, దానముచేగాని, యజ్ఞముచే గాని చూచుటకు శక్యుడనుగాను.

విశ్వరూపం గురించి చెప్తూ అర్జునుడికి శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్తాడు, వేదాల వల్లకాని, దానాల వల్లకాని, యజ్ఞాల వల్లకాని, తపస్సుల వల్లకాని, ఏ విధంగానూ కూడా నువ్వు నన్ను ఏ విధంగా అయితే ఈ విశ్వరూపాన్ని చూడగలిగావో, ఆ విశ్వరూపాన్ని నువ్వు,

❋ ఏ విధమైన నీ ప్రయత్నాల వల్ల చూడలేవు.

-- మీ సాధన వల్ల మీరు అనంతమైనటువంటి ఆ భగవంతుడ్ని పొందుతాము అనుకుంటే, వెంట్రుకని కట్టి కొండని లాగినట్టే.

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్. (భ.గీ. 10-42)

అర్జునా! లేక విస్తారమైన ఈ (విభూతి) జ్ఞానముచే నీకేమి ప్రయోజనము? నేనీ జగత్తునంతను ఒక్క అంశము చేతనే వ్యాపించియున్నాను (అని తెలిసికొనుము).

ఈ విశాల విశ్వము గురించి మీ మనస్సుకి ఎంత తెలుసో ఊహించండి.

ఈ పాలపుంతలు, ధ్రువ నక్షత్రాలు, ఎక్కడెక్కడికో మీరు వెళ్ళగలరు. అవన్నీ కూడా శ్రీకృష్ణుడు నా యొక్క ఒక్క అంశ మాత్రమే అంటాడు.

❁ మీరు చేసే ఈ బచ్చా సాధనలు, ఈ గాయత్రీ మంత్రాలు, ఈ యజ్ఞాలు, ఈ అనుగ్రహ మాలామంత్రాల వల్ల మీరు యోగము సాధించలేరు అనే ఒక నిర్దిష్టమైనటువంటి, కచ్చితమైనటువంటి అవగాహనకి మీరు రావాలి.

మరి ఎలా వస్తుంది యోగం?

మరి ఇది అంత కష్టం, అసంభవం, మనం చేయలేం అన్నప్పుడు ఇంక భగవద్గీత వినటం ఎందుకు? దాని గురించి మళ్ళా 18 యోగాలు ఉన్నాయి. మీరు చాలా జాగ్రత్తగా వినండి అని నేను చెప్పటం ఎందుకు?

**ఎందుకు అంటే,**

న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ (భ.గీ. 11-8)

ఈ నీమాంసమయ నేత్రములతో నీవు నా విశ్వ రూపమునుగాంచజాలవు. కావున దివ్యదృష్టిని (జ్ఞాననేత్రమును) నీకు ప్రసాదించుచున్నాను. దానిచే ఈశ్వర సంబంధమైన నా యోగమహిమను జూడుము.

దివ్యం దదామి తే చక్షుః - నీకు కావలసిన ఆ దివ్యమైన చక్షువు నేను ఇస్తాను.

❃ ఆయన ఇవ్వకపోతే మీరు చూడలేరు.
ఇవ్వవలసింది ఆయన. చేయవలసింది ఆయన.

**ఉపనిషత్తుల్లో కూడా ఈ మాట చాలా స్పష్టంగా చెప్పబడుతుంది,**

ఆయన వరించాలి. మనం కాదు.

మనం ఏమిటి? అప్లికేషన్ పెడతాం అంతే.



☝ ఈ అప్లికేషన్ యొక్క రిజల్ట్ ఏమవుతుంది అనేది నిర్ణయించేటటువంటి ఫైనల్ అథారిటీ ఆ యోగేశ్వరుడు, ఆ పురుషోత్తముడు.

"మరి ఈ సాధనలన్నీ వేస్టేనా మాస్టారు?"

✧ వేస్ట్ కాదు. దానికి అనుకూలమైన మానసిక, శారీరక, ఆలోచనాత్మకమైన పరిస్థితి ఏర్పరుస్తుంది.

కానీ ఆ భగవద్గీతలోనే చాలా చోట్ల గ్యారంటీ ఇస్తాడు, నువ్వేమీ గాబరాపడకు, నేనున్నాను.

తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్
భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్. (భ.గీ. 12-7)

ఓ అర్జునా! నాయందు చిత్తమునుజేర్చిన అట్టివారిని మృత్యురూపమగు ఈ సంసార సముద్రము నుండి నేను శీఘ్రముగ బాగుగ లేవదీయుచున్నాను.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం (భ.గీ. 9-22)

ఎవరు ఇతర భావములు లేనివారై నన్నుగూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠ గల్గియుండు అట్టివారియొక్క యోగ క్షేమములను నేను వహించు చున్నాను.

యోగక్షేమం వహామ్యహం - వాళ్ళ యొక్క యోగాన్ని, క్షేమాన్ని కూడా నేనే వహిస్తాను.

ఆ మాట అర్థం ఏమైనా మీరు ఆలోచించారా?
"నువ్వు నన్ను తప్ప ఇంకేం ఆలోచించకు!"

అప్పుడు నీ యోగము, నీ క్షేమము యొక్క బాధ్యత ఎవరిది?
ఆయనది. అది అర్థం చేసుకోండి.

✧❃✧

# యోగవిద్యకు మీకు కావలసింది ఒకటే, దూకే సాహసం కావాలి. దూకేయగలగాలి

"యోగము" అనే పదాన్ని మనం చాలా చవక బారుగా వాడుతున్నాం. దాన్ని బజారుపాలు చేసేశాం.

✧ ఆధ్యాత్మిక సాధనలో మానవీయ చేతనత్వం యొక్క పరాకాష్ట యోగము.

మనం మనుష్యులుగా పుట్టాం. జంతూనాం నరజన్మ దుర్లభం అన్నాం. ఆ మనుష్యులుగా పుట్టినటువంటి మానవులలోనే అనేక జాతులు, అనేక వర్ణాలు, రకరకాలుగా చెప్పుకుని వచ్చారు.

చేతనత్వ స్థాయిల్లో ఇంక అంతకంటే ఎక్కువ స్థాయికి వెళ్ళలేనటువంటి ఋషిస్థాయిని కూడా మళ్ళా 5 రకాలు చేయగలిగారు.

❋ ఋషి, మహర్షి, రాజర్షి బ్రహ్మర్షి, దేవర్షి.

ఋషిత్వం రావాలంటే, యోగస్థితిలో ఉండాలి.
యోగస్థితిలో ఉన్న వ్యక్తి అన్నా, ఋషి అన్నా ఒకటే.

ఇంత అత్యధికమైనటువంటి స్థాయిలో ఉన్న చేతనత్వానికి తీసుకుని వెళ్ళే మార్గాన్ని చివరికి ఎక్కడికి తీసుకొచ్చాం మనం? "ఒక మంత్రాన్ని జపం చేసుకుంటే వచ్చేస్తుంది. యజ్ఞం చేస్తే వచ్చేస్తుంది."

అంత ఈజీగా రాదది.

కానీ అసంభవమా? అసంభవమేమీ కాదు. ఆ కిటుకు తెలియాలంతే. తెలిస్తే సులభమే. ఇంక అది అడుగడుగునా మీకు ఉపయోగపడుతుంది.



సైకిల్ త్రొక్కటం వచ్చినవాడు ఎక్కడికైనా వెళ్ళాలంటే, సైకిల్ ఉందా అని అడుగుతాడు. రానివాడికి సైకిల్ ఉన్నా దాన్ని వాడు ఏం చేసుకోలేడు. అలాగే కారు, స్కూటరు, ఈత కొట్టటం.

మరి ఈత కొట్టటం సులభమా, కష్టమా? వచ్చిన వాడికి చాలా సులభం. రాని వాడికి ఇంక అంతకంటే కొంపలు అంటుకుపోయే పరిస్థితేం ఉండదు.

ఒక పడవలో ఒక పండితుడు, ఒక పడవవాడు వెళుతున్నార్ట. రామకృష్ణ పరమహంస చెప్తాడీ కథని. పండితుడు నోరు మూసుకుని కూర్చోలేడు కదా! పండితుడు అంటేనే అర్థం, వాడు నోరు మూసుకుని కూర్చో లేడు అని. ఎవ్వడూ లేడు పడవలో, పడవ వాడితోనే మాట్లాడుతున్నాడు.

"ఏమయ్యా నీకు లెక్కలొచ్చా?" "రావు."

అసలు ఆ పండితుడికి బుద్ధుండాలి కాని, ఎలా వస్తాయనుకున్నాడు? కానీ పండితులు అలాంటి ప్రశ్నలే అడుగుతారు. సరే, లెక్కలు రావంటే, "వేస్ట్, నీ ఒన్ ఫోర్త్ లైఫ్ వేస్టయిపోయింది" అన్నాడు.

"సరే, కెమిస్ట్రీ వచ్చా?" "రాదు." ఇంకొక వన్ ఫోర్త్ పోయిందన్నాడు.

"ఫిజిక్స్ వచ్చా?" "రాదు." 3 వంతుల జీవితం పోయింది అన్నాడు.

ఈ లోపల తుఫాన్ వచ్చింది.

ఇప్పుడు పడవవాడు అడిగాడు, "ఈత వచ్చా?" "రాదు."

"నీ ఖర్మ, నీ పూర్తి జీవితం పోయింది, నేను పోతున్నాను" అన్నాడు, పడవవాడు దూకేశాడు.

యోగవిద్య కూడా అంతే.

మీరు గాబరాపడిపోయి, "మాకేం తెలీదే! మరి ఏం చెయ్యాలి?"

❀ ఏం లేదు, మీకు కావలసింది ఒకటే,
దూకే సాహసం కావాలి. దూకేయగలగాలి.

ఈత నేర్చుకోవటానికి మీరు దూకగలగాలంతే.
అంతకంటే మీరు చేసేదేం లేదు.

***దూకేశాక ఏం జరుగుతుంది?***

ఇంక దూకేశాక చేసేదేముంది? అప్పుడు ఆయన వాగ్దానం చేసినా చెయ్యకపోయినా, చేసేదేదో ఆయనే చేసుకుంటాడు.

✧ ఇది చాలా గొప్పది అని తెలుసు, దూకలేకపోతున్నామనే ఆ బాధ ఉందే, ఆ బాధని అర్జున విషాద యోగము అన్నారు.

ఇది కూడా యోగమే.

ఎంచేతంటే, ఆ బాధ రానంత వరకు అసలు జరగదుగా!

✵ యోగము అనేది అదేదో చాలా గొప్పది ఉంది. ఆ గొప్పదైన విషయాన్ని నేను అవగాహన చేసుకోవాలి, దాన్ని నేను పొందాలి అనే ఆ ఆవేదన, ఆ తపన, మీలో బయలుదేరనంత వరకు ఏ సాధన మనం చేసినా కూడా యోగవిద్య యొక్క మొదటి అడుగు ఇంకా మనం వెయ్యలేదని అర్థం.

❀ మనమందరం అనేక జన్మల బట్టి ఆ మెట్టు మీదే ఉన్నాం.
ఆ మెట్టు నుంచి దూకలేకపోతున్నాం.

మీరు అన్వేషితలో చూసుంటారు, మిగతా పిల్లలు జంప్ చేస్తారుకాని, మన అనిరుద్‌గారు భయంతో జంప్ చేయడు. అప్పుడు అతని మాస్టరు మెల్లిగా దగ్గరకి వచ్చి అతన్ని ఎత్తి విసిరేస్తాడు. ఈత వచ్చేస్తుంది. ఆ సాహసం!

✣☆✣



# మీ అసలైన గురువు మీ మనస్సే

చిన్నప్పటి నుంచి కూడా పాండవులు కష్టపడుతూనే ఉన్నారు. రకరకాలైన అస్త్రాలు, శస్త్రాలు సంపాదించుకున్నా వాళ్ళకి మనం అనుకునే మనశ్శాంతి లేదు.

వాళ్ళు పాపం శాంతియుతంగానే ఉన్నారని నా నమ్మకం. కానీ ప్రజల ఉద్దేశ్యం ఏమిటంటే, వాళ్ళకి రాజ్యం లేదు కనుక వాళ్ళు సుఖంగా లేరు అని.

కానీ వాళ్ళకు రాజ్యం ఉందో, లేదో దేన్ని బట్టి తెలుస్తుంది అంటే, అడివిలో ఉన్నప్పుడే అర్జునుడు ఇంద్రుడి అర్థ సింహాసనం మీద కూర్చోగలిగాడు.

✧ ఇంద్రుడి యొక్క అర్థ సింహాసనం మీద కూర్చోగలిగే వాడికి రాజ్యం ఉన్నట్టా, లేనట్టా?

అందుచేత మన దృష్టికోణానికి, యోగవిద్య సాధకుల యొక్క దృష్టికోణానికి ఉన్న తేడా కొంచెం అర్జున విషాద యోగంలో మీరు అర్థం చేసుకోండి.

అక్కడ మొదటి శ్లోకంలోనే మొత్తం రంగరించి పెట్టేశాడు. టైటిల్‌లోనే, అర్జున విషాదయోగంలోనే మొట్టమొదటే ఏం చెప్పాడక్కడ?

***ధృతరాష్ట్ర ఉవాచ.***

ధృతరాష్ట్రుడు అంటే మనమే.

ఆ దృష్టికోణంతో మీరు భగవద్గీతను చదవండి తప్ప అర్జునుడు, కృష్ణుడు మాట్లాడుకున్నారు అని మాత్రం చదవకండి.

అర్జునుడు అంటే నువ్వు. ఎవరు పుస్తకం చదువుతున్నారో వాళ్ళు.
శ్రీకృష్ణుడు ఎవరు? నీ లోపల నుంచి చెప్తొన్నటువంటి శక్తి.

చాలా మంది నన్ను అడుగుతారు, మీ గురువు ఎవరని?

శ్రీరామశర్మ ఆచార్య అని చెప్తాను. శుద్ధ తప్పు.

అలాగే ఎవరైనా ఫలానా ఆయన మా గురువు అని చెప్తూవుంటారుకదా, అందరూ అబద్ధాల కోరులే. పరమ అబద్ధాల కోరులు.

**ఎందువల్ల అబద్ధం?**

మీకు నచ్చకపోతే వాళ్ళు చెప్పిన మాట వినరు.

గురువు అంటే గురువు మాట వినాలికదా!

**మీరు ఎవరి మాట వింటున్నారు?**

మీ మనస్సు యొక్క మాట వింటున్నారు.

గురువు మాట ఎక్కడ వింటున్నారు మీరు? నిజం చెప్పండి? ఒకవేళ విన్నారే అనుకోండి, అంటే మీ మనస్సు ఆయన చెప్పింది వినటానికి ఒప్పుకుంది.

❂ అంటే అసలు గురువు ఎవరు? మనస్సు.

అందుచేత బాహ్యంగా ఉన్న గురువు జోలికి వెళ్ళకండి. ఎంచేతంటే, ఆయన చెప్పింది మీకు నచ్చితే, అది మీదే.

కెమిస్ట్రీ చదివినవాళ్ళందరూ కెమిస్ట్లు అని చెప్పటంలేదా! డాక్టరీ చదివిన వాళ్ళందరూ కూడా డాక్టర్లే. అదే విధంగా యోగవిద్య చదివిన వాళ్ళందరూ కూడా ఒకే చేతనత్వము కలిగినటువంటి గురువులు.

ఆ స్థాయికి ఏది వెళుతోంది? మీ మనస్సు వెళుతోంది.

**ఆ మనస్సు ప్రస్తుతం ఎలాంటి స్థితిలో ఉంది అంటే,**

ధృతరాష్ట్ర స్థితిలో ఉంది.

☆✡☆



# ధర్మక్షేత్రంలో ఏర్పడిన ఆ గ్రుడ్డితనాలు నుండి బయటపడండి!

ధృతరాష్ట్ర స్థితిలో ఉన్న మనస్సు ప్రశ్నిస్తోంది. ఏమని ప్రశ్నిస్తోంది?

ధృతరాష్ట్ర ఉవాచ :-

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సంజయ.

ధృతరాష్ట్ర ఉవాచ - ధృతరాష్ట్రుడు, అంటే, మీరే అడుగుతున్నారు. ఏమని,

ధర్మక్షేత్రే - ధర్మక్షేత్రంలో,

కురుక్షేత్రే - పనిచేసేటటువంటి క్షేత్రంలో,

సమవేతా - యుద్ధం కోసం జేరినటువంటి వ్యక్తులు

కిమకుర్వత - ఏమి చేశారు?

ఈ పరిస్థితి మీది, మనది, ప్రతీ సాధకుడిది.

శ్రీ పరిపూర్ణమైనటువంటి ఆత్మ సమర్పణ చేతకానంత వరకు ఈ మొదటి శ్లోకంలోనే ఉంటాం మనం.

అర్జున విషాద యోగం యొక్క మొదటి శ్లోకమే అందరికీ గతి.

**ఎందువల్ల మొదటి శ్లోకమే గతి?**

ధర్మక్షేత్రే అనగానే మనకేం గుర్తొస్తుంది, హిందూ ధర్మం గుర్తొస్తుంది. లేకపోతే బౌద్ధధర్మం, క్రిస్టియానిటి, ఇలాగ ఉన్నాయికదా ధర్మాలన్నీ.

అవి గుర్తొస్తాయి.

కానీ ఇవన్నీ ధర్మాలు కావు అని భగవద్గీత చెప్తుంది. మీరు దీన్ని ధర్మం అనుకుంటున్నారు, గంగలో దిగిపోతున్నారు. ఇవన్నీ ధర్మాలు కావు.

భారతీయ సాంప్రదాయంలో ధర్మం అనేదానికి ఒక కండిషన్ పెట్టారు.

*ఆ ధర్మం ఎలా ఉండాలిట,*

అపౌరుషేయం అయివుండాలి.

మనిషి ద్వారా ఆపాదించబడినది కాకూడదు.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి, మీకు విషాదం అందువల్ల వస్తోంది.

రాములవారిని ఎవరో ఏదో అన్నాడు. రాముల వారు మనకు ఆరాధ్య దైవం కనుక కోపం వచ్చేసింది. రాములవారు ఆరాధ్యదైవం కాని వాళ్ళకి ఆ మాట అంటే ఎలా ఉంటుంది? చాలా ఆనందంగా ఉంటుంది.

*ధర్మం ఏం చెప్తుంది అంటే,*

అందరికీ ఒకేలాగ ఉండాలి.

ఒకేలాగ లేకపోతే అది ధర్మమే కాదు.

ఉప్పు ఉప్పగానే ఉంటుంది. అది దాని ధర్మం. పంచదార తియ్యగా ఉంటుంది. అది దాని ధర్మము. నిప్పు ముట్టుకుంటే చల్లగా ఉంటే, కచ్చితంగా అది నిప్పు కాదు. నీళ్ళు, ముట్టుకున్నారు, తడి తగలకపోతే అవి మయసభలో నీళ్ళయివుంటాయి. అప్పుడే కదా నీళ్ళు లేకపోయినా నీళ్ళు ఉన్నాయనిపిస్తుంది.

ధర్మము అంటే ఏమిటో అర్థమవుతోందా? ఈ ధర్మం గురించి ఆలోచించండి. మొదట ఈ అవగాహనకి రండి. మీరు హిందువులా, క్రిస్టియన్లా, ముస్లిమ్‌లా, జైనులా, ఇవన్నీ కూడా ధర్మాలు కాదు, మతాలు.

❋ మతాలను పట్టుకుని ధర్మాల పేరిట గాబరాపడి కొట్టుకు చస్తున్నాం.



వివేకానంద ఒకచోట వ్రాశాడు, ఇప్పటికి ఇంకా చాలా అయ్యుంటుంది. రెండు మహాయుద్ధాలలో పారినటువంటి నెత్తురు కంటే, ధర్మం పేరిట పారిన నెత్తురు పది రెట్లు ఎక్కువ అన్నాడు. అప్పుడు. మరి ఇప్పుడు?

*ఎందువల్ల అలా జరిగింది?*

మన గుడ్డితనం వల్ల.

ఆ గుడ్డితనానికి "<u>ధృతరాష్ట్రత్వము</u>" అనే క్రొత్త పేరు పెట్టుకుందాం.

*మనలో ఉన్నటువంటి ధృతరాష్ట్రత్వము ఏమిటంటే,*

ధర్మాన్ని నియమాలలో ఏరుకుంటాం.

*ఎలాంటి నియమాల్లో వెతుక్కుంటాం?*

మనిషి ఏర్పర్చుకున్న నియమాల్లో వెతుక్కుంటాం.

మనం చేసే మొట్టమొదటి ధృతరాష్ట్రత్వం అది.

ముందు అది వదులుకోవాలి. ఆ ధైర్యం రావాలి మీకు.

అర్జునుడు అదే తప్పు చేశాడు. యుద్ధానికి రెడీ అయి వచ్చేశాడు. నా తాత మీద, గురువు మీద, బంధువుల మీద నేను బాణం ఎలా వేస్తాను అన్నాడు.

వేస్తే కులక్షయం అయిపోతుంది అన్నాడు. లుప్తపిండోదక క్రియాః అసలు మనకి పిండప్రదానం చేసేవాళ్ళే ఉండరు పో అన్నాడు.

❋ మొదటే లెక్చర్ కొట్టేశాడు. గురువుని నోరు విప్ప నివ్వలేదు. 40 శ్లోకాల్లో వాయిస్తాడు గురువుని.

*కానీ అవంతా ఏమిటి?*

మానవ నిర్మితమైనటువంటి సో కాల్డ్ ధర్మాలు.

వాటికి ఏమీ విలువ లేదు.

ఆ విలువలు మీరు ఏర్పర్చుకుంటే ఉంటాయి.
ఏర్పర్చుకోకపోతే ఉండవు.

చాలా చోట్ల పెళ్ళికంటే ఘనంగా వడుగు చేస్తారు. ఇప్పటికీ కొంతమంది చేస్తున్నారు. అందుకే ఇంగ్లీష్ వాళ్ళు దానికి థ్రెడ్ మేరేజ్ అని పేరు పెట్టారు. థ్రెడ్ మేరేజ్ అంటే తాడుతో పెళ్ళి చేసుకోవటం అని. చేశాక ఆ తాడు వీపు గోక్కోవటానికి పనికొస్తుంది. ఇంక దేనికీ పనికిరాదది. దానికి ఎందుకంత ఖర్చు?

ఇంకొక ధృతరాష్ట్రత్వం.

ఇంతోటి ఆ తాడు ముక్క కోసం మనం ఎందు కింత ఖర్చు పెట్టాలి అని కూడా అడగం. చేశారు. చేశాక గాయత్రీ చేసుకుంటున్నాడా వాడు? చేసుకోవటంలేదు. మరి ఎందుకు చేస్తున్నాం మనం? అందరూ చేస్తున్నారు కనుక.

మన సాంప్రదాయము, మన యొక్క ఋషుల యొక్క అవగాహన ప్రకారము కనీసము 8 వ ఏట వడుగు అయిపోవాలి వాళ్ళకి.

- 8 వ ఏట వడుగు అయిపోతే 24 ఏళ్ళు వచ్చే లోపల వాడు ఆ గాయత్రీ మంత్ర సాధనలో తన చేతనత్వంలోని అనేక ఉచ్చస్థాయిలకి జేరుకోవాలి.

ధర్మ క్షేత్రంలో ఏర్పడిన గుడ్డితనంతో వచ్చిన కష్టాలివి.
అర్జునుడి విషాదానికే కాదు, మీ విషాదానికి కూడా అదే కారణం.

"నేను చేయవలసినట్టు చేయలేదేమో! ఎడం చేత్తో ఆరతి పళ్ళెం ముట్టుకున్నాను! ఇప్పుడేం చేయాలి?"

- ధర్మం అనే పేరుతో మనం చేస్తోన్న ఈ కర్మకాండలు అన్నీ గుడ్డివి.

ధృతరాష్ట్ర ఉవాచ అని ఎందుకు అన్నాడు అంటే,
గ్రుడ్డివాని యొక్క మాటలు అవి.



- మన ధర్మం అంతా కూడా గుడ్డిదే.
  ఏ ధర్మాన్ని అయినా తీసుకోండి.

మనం గురువుల్ని ఫాలో అవుతున్నాం.

నిజంగా గురువుల్ని ఫాలో అవుతున్నామా?

బుద్ధుడు - బౌద్ధ ధర్మము. క్రైస్ట్ - క్రిస్టియానిటి. మహమ్మద్ - ముస్లిం ధర్మము. రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవిందో, శ్రీరామశర్మ ఆచార్య, వీళ్ళు గురువులే కదా!

వీళ్ళందరూ గురువులు అయితే,
మనం గుడ్డివాళ్ళం కాకపోతే మనకి ఒక ప్రశ్న వచ్చి ఉండాలి.

- బుద్ధుడు తర్వాత ఎంతమంది బౌద్ధులు బుద్ధత్వం పొందారు?
  ఇంకొక బుద్ధుడు ఏడి?

-- రామకృష్ణ పరమహంస ఒక వివేకానందని అందించాడు.
ఇంకొక వివేకానంద ఏడి?

ఫాలోవర్స్ కొన్ని లక్షలమంది ఉన్నారుకదా. ఇన్ని లక్షల మందిలో ఆ స్థాయికి ఎదగలేని వ్యక్తులే అందరూ అనా మీ ఉద్దేశ్యం? ఒకవేళ అదే మన ఉద్దేశ్యం అయితే వివేకానంద చెప్పింది తప్పేకదా!

ఈచ్ సోల్ ఈజ్ పొటెన్షియల్లీ డివైన్ అన్నాడు వివేకానంద.

ప్రతీ ఆత్మ బీజరూపంలో భగవంతుడు అయితే రామకృష్ణ పరమహంస, వివేకానంద చెప్పిన మార్గమే ఆ భగవతత్వానికి చేరువగా తీసుకెళ్ళగలిగేది అయితే, ఇంకొక వివేకానంద ఎందుకు రాలేదు?

ధర్మక్షేత్రే - ధర్మక్షేత్రాన్ని మీరు కూలంకషంగా పరిశీలించండి.

✧ రామభక్తులు చాలామంది ఉన్నారు. ఇంకొక రాముడు ఏడి?

ఇంజనీరింగ్ చదివినవాడు ఇంజనీరింగ్ గురించి మొత్తం చెప్పగలిగితే, తిరిగి మళ్ళా వాడు ఎక్కడి వెళుతున్నాడు? ఆ ఇంజనీరింగ్ కాలేజ్‌లోనే లెక్చరర్‌గా వెళ్ళి ఆ లెక్చరర్ ప్రక్కన కూర్చుంటున్నాడు.

అంటే ఆ విషయంలో వాడు నిష్ణాతుడు అయితే, తిరిగి అతన్ని ఇంజనీర్ అనే పిలుస్తున్నాం.

✧ మరి రామభక్తుడు ఇంకొక రాముడు ఎందుకు అవలేకపోతున్నాడు?
కృష్ణభక్తుడు ఇంకొక కృష్ణుడు ఎందుకు అవలేక పోతున్నాడు?
అరవిందో సొసైటీ నుంచి ఇంకొక అరవిందో ఎందుకు రాలేదు?

☝ ధర్మక్షేత్రే – ఈ ప్రశ్న మీకు రావటం మొదలెడితే,
యోగసాధనలో మీరు అడుగు పెట్టినట్టే.

కానీ ఆ గురువులు చెప్పిన మార్గం తప్పా?

తప్పు కాదు. ఆ  మార్గం హండ్రెడ్ పర్సెంట్ కరెక్టే.

మన దృష్టికోణం తప్పింది.

❂ మన దృష్టికోణం ఏమిటంటే, ఇంత అద్భుతమైన శక్తి సంపన్నమైనటువంటి
గురువులు, మన కూతురికి పెళ్ళి చేయించటానికి,
మనకి ఉద్యోగం ఇప్పించటానికి,
మన అప్పులు తీర్చటానికి, మనం ఇళ్ళు కట్టుకుంటూ వచ్చే అడ్డంకులు
తొలగించటానికి వచ్చారు అని.

ఇంకొక ధృతరాష్ట్రత్వము ఇది.

ముందు అది కరెక్ట్ చేసుకోండి.

❀✳❀



# కురుక్షేత్రంలో కూడా మనం గ్రుడ్డివాళ్లమే!

*ధర్మక్షేత్రంలో గుడ్డితనం యొక్క పరాకాష్ట ఏమిటంటే,*

ఇన్ని ఆధ్యాత్మిక సంస్థలు ఉన్న భారతదేశంలో ఆధ్యాత్మికత గురించి స్పష్టమైనటువంటి అవగాహన ఉన్నవాళ్ళు మనకి ఎక్కడా కనిపించరు.

✧ మనకి ఇంకొక గుడ్డితనం ఉంది, కురుక్షేత్రే.

పోనీ, ధర్మక్షేత్రంలో మనకి అవగాహన లేదు, మనం ఫిలాసఫర్స్‌మి కాము, అసలు మనకి దేముడూ వద్దు, దెయ్యమూ వద్దు.

ఏదో నేను బ్రతికున్నాను. ఉద్యోగం చేసుకుంటున్నాను, పెళ్ళాం, పిల్లలు ఉన్నారు, వాళ్ళని పోషించుకుంటున్నాను. అక్కడితో నన్ను వదిలేయండి అన్నాడు.

వదిలేశాడు. ఎవడు వదిలేశాడు? శ్రీకృష్ణుడు.

*వదిలేసి, ఇంకొక ప్రశ్న వేశాడు అక్కడ,*

కురుక్షేత్రే. "నాయనా, అక్కడ కూడా నువ్వు గుడ్డివాడివే!"

*ఎందుకు నువ్వు అక్కడ కూడా గుడ్డివాడివే?*

ఇల్లు కట్టుకున్న తరవాత రేపు ఎవడైనా వచ్చి నువ్వు ఇల్లు ఖాళీ చేసేయ్యాలని గ్యారంటీగా చెప్తాడు అని తెలిస్తే, అక్కడ ఇల్లు కట్టుకుంటారా?

మనం కట్టుకుంటున్నాం. కురుక్షేత్రే.

మనకి తెలుసు గ్యారంటీగా ఎప్పుడో అప్పుడు ఇల్లు వదిలి వెళ్ళి పోవాలని. ఎక్కడికి వెళ్ళాలో మనకి తెలియదు, అది వేరే విషయం. కానీ గ్యారంటీగా మృత్యువు వస్తుంది, మృత్యువు వచ్చిన తరవాత వెళ్ళిపోవాలి.

మరి అది మూర్ఖత్వం కాక ఏమిటి?

భౌతిక సుఖాల క్షేత్రంలో మీరు చూసుకున్నా మృత్యువు తప్పదని మీకు తెలిసున్న తరవాత మీరు చేసే ఏ పని అయినా గ్యారంటీగా తప్పే అవుతుంది.

బుద్ధుడు మారింది అక్కడే, ఆ కురుక్షేత్రంలోనే.

✧ మొట్టమొదట ఒక రోగగ్రస్తుడ్ని చూశాడు. నాకు రోగం వస్తుందా? అన్నాడు. వస్తుందన్నాడు. ఒన్ థర్డ్ లైఫ్ అవుట్ అనుకున్నాడు.

✧ తరవాత ఒక ముసలాడ్ని చూశాడు. నేను ముసలాడ్ని అవుతానా? అన్నాడు. గ్యారంటీగా అవుతావు అన్నాడు. టూ థర్డ్స్ లైఫ్ అవుట్ అనుకున్నాడు.

✧ ఈ లోపల ఒక శవం వెళుతోంది. చూశాడు. నేను చస్తానా? అన్నాడు సారధిని. గ్యారంటీగా చస్తావయ్యా అన్నాడు.

ఎవడో మంచి సారధి వాడు.

కానీ బుద్ధుడు మనలాంటి సాధకుడు కాదు.
బుద్ధుడులాంటి సాధకుడు.

✧ అయితే నేను ఎలాగూ చచ్చేదానికి ఈ గందరగోళం అంతా ఎందుకు అనుకున్నాడు.

శ్రీ వైరాగ్యం కాదిది, జాగ్రత్తగా అర్థం చేసుకోండి.
నేను వైరాగ్యం గురించి మాట్లాడటం లేదు.
బాధ్యతా రాహిత్యం గురించి కూడా మాట్లాడటం లేదు.

మన యొక్క షార్ట్ సైటెడ్‌నెస్, మంద చూపు,
ఎందుకూ పనికిరాని వాటి సేకరణలో అర్థం ఏమైనా ఉన్నదా?
నువ్వు దాన్ని ఉపయోగించుకోలేవు.



అనంతమైనటువంటి ఈ కాలంలో నీకు కాస్త అనుభవించాలి, తెలియాలి అనేటటువంటి ఏజ్ ఓ 20 ఏళ్ళకో, 25 ఏళ్ళకో వస్తుంది. కాస్త సంపాదించుకుని నిలద్రొక్కుకోగలిగే సరికి 40 ఏళ్ళు వస్తాయి.

40 ఏళ్ళు వచ్చేసరికి వృద్ధాప్యం స్టార్ట్.
మోకాళ్ళ నొప్పులు, కళ్ళ జోళ్ళు, దగ్గులు, ఆయాసాలు, అన్నీ స్టార్ట్.

✺ ఇంతకీ నువ్వు సంపాదించుకున్నది ఎవరి కోసం అని?

కురుక్షేత్రంలో కూడా నువ్వు గుడ్డివాడివే.

సమవేతా యుయుత్సవః - ఇలాంటి గుడ్డివాళ్ళు దెబ్బలాటకి కూర్చున్నారు.

అక్కడ తమాషా అది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే - ఇటు ధర్మం గురించీ ఏమీ రాదు. పోనీ భౌతిక జీవితంలో మీకు ఏమైనా అవగాహన ఉందా? దాని గురించీ ఏమీ లేదు.

మన బంధువులతో కాని, మన స్నేహితులతో కాని, మన పెళ్ళాం పిల్లలతో కాని, మన పై ఆఫీసర్స్‌తో కాని ఎంత వరకు మెలగాలి అనేది తెలియదు.

కోపం వచ్చిందా, ఎదుటివాడు ఫినిష్! ప్రేమ వచ్చింది. అప్పుడూ ఎదుటి వాడు ప్రేమలో ఫినిష్షే! ఏదొచ్చినా ప్రమాదమే. అక్కడా గ్రుడ్డితనమే.

మన బంధుత్వాలలో, మన జీవితాలలో మృత్యువు కచ్చితంగా మనకు ఎప్పుడో అప్పుడు వస్తుంది. ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఒక 70 ఏళ్ళ తరువాత గ్యారంటీ అన్నప్పుడు ఏ పనికి మనం ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి?

✧ దేనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి అనేటటువంటి ఒక నిరంతర మథన మీలో స్టార్ట్ అయితే, దాన్ని అర్జున విషాదయోగం అంటాం.

✺✺✺